కథా నిలయం
3533
శ్రీకాకుళం

# దోస్త్ రానిక నీకోసం

పగలు పన్నెండు గంటలు కావస్తోంది.

ఎండ నిప్పులు చెరుగుతోంది. అరవయ్యేళ్ళ శివాజీరావు గారు భోజనం చేసి వరండాలో వాలు కుర్చీలో కూర్చున్నారు. నిద్ర కళ్ళ మీదకి తూగుకొస్తుంది. మనసు పోస్టుమేన్ కోసం యెదురు చూస్తోంది. ఏ సైకిల్ శబ్దమైనా పోస్టుమేనేమో అన్న భ్రమలో ప్రహరీ గేటు వైపు ఆశగా చూడసాగారు.

యివాళ శంభు దగ్గర నుంచి ఉత్తరం రావల్సిన రోజు. "ఈ పోస్టు మేనుకి యేం పోయే కాలం వచ్చిందో యివాళే ఆలశ్యం చేస్తున్నాడు" విసుక్కున్నారు మనసులో శివాజీరావు గారు. శివాజీరావు గారు స్కూలు మాష్టరుగా వుద్యోగం చేసి రిటైర్ అయ్యారు. ఆయనకి ఒకే ఒక్క కొడుకు ప్రభాకర్ ప్రభాకర్‌కి మూడేళ్ళు నిండకుండానే తల్లి కాస్తా పోయింది. స్నేహితులూ, బంధువులు శివాజీని మరోపెళ్ళి చేసుకోమని సలహా చెప్పారు. వత్తిడి తెచ్చారు.

నా బిడ్డకి సవతి తల్లిని తేను. ఎంతకష్టమైనా సరే నేనే పెంచి పెద్ద చేస్తాను అన్నారు. అంతే ఆ మాట మీదే వున్నారు. ప్రభాకర్‌ని పోస్టుగ్రాడ్యుయేట్‌ని చేశారు. బ్యాంకులో ఆఫీసరు వుద్యోగం వచ్చింది. అంతే ఆడపిల్లల తండ్రులు వేట ప్రారంభించారు, తండ్రీ కొడుకూ నాలుగు సంబంధాలు చూశారు. అందరిలోనూ శ్యామల నచ్చింది

ప్రభాకర్‌కి. అంతా వాడి యిష్టమే నా యిష్టం అనుకుని కట్నకానుకలు మాకొద్దు అనేసి కొడుకు పెళ్ళి చేసి కోడలిని ఇంటికి తీసుకువచ్చారు "అమ్మయ్య యిప్పటికి ఇంటిబాధ్యత నాకు తీరింది. హాయిగా కృష్ణా రామా అనుకుంటూ కాలక్షేపం చేసుకోవచ్చు. తీర్థయాత్రలు చేయవచ్చు నిశ్చింతగా బ్రతకవచ్చు" అనుకున్నారు శివాజీరావుగారు.

శ్యామల కాపురానికి వచ్చిన కొత్తలో అతి నెమ్మదిగా వుండేది. మామగార్ని యెంతో మర్యాదగా చూసేది. ఆయనకి కావల్సినవన్నీ సమయానికి అమర్చేది. అయితే ఆరు నెలలు తిరక్కుండానే ఆ అమ్మాయిలో మార్పు రాసాగింది. ఆ మార్పుని త్వరగానే గుర్తించగలిగారు శివాజీరావు గారు. దీనికి కారణం యేమిటో త్వరగానే అర్థం చేసుకున్నారు.

భర్త అతిప్రేమ ఆ పిల్లలో అహంభావాన్ని నెలకొల్పింది. భార్యలేని మామగారంటే విసుగుకల్గసాగింది. ఈయన పానకంలో పుడకలా తమ మధ్యవుండి తీరాల్సిందేనా ! అన్నభావం ఆ పిల్లలో సహనాన్ని పోగొట్టింది. తనతోపాటు పెళ్ళి అయిన తన స్నేహితులు యెందరూ చిలకాగోరింకలా భార్యాభర్తలు కాపురాలు చేసుకుంటూ స్వర్గసుఖాలు పొందుతున్నారు. తన ముఖానే ఈ రాత రాసిపెట్టి వుంది" అన్నభావం రోజురోజుకీ పెరిగి ముసలాయన అంటే తేలిక భావాన్ని కలగజేసింది. అది ప్రతి మాటలోనూ వ్యక్తం కాసాగింది.

శివాజీరావు గారు యిది భరించలేకుండా వున్నారు. లోలోపల కుమిలిపోసాగారు. ఈ పిల్ల నేనుండటం 'బరువు' అనుకుంటూ వుందే కానీ ఈ నేను లేకుంటే ప్రభాకర్ ఈ స్థితికి వచ్చేవాడా. వాడిని కట్టుకున్న తను యిలా సుఖపడగలిగేదా ! ఈ విషయం యెందుకు ఆలోచించదు ! తండ్రి కట్నం యివ్వలేని స్థితిలో వున్నాడని యెందరో పెళ్ళి కొడుకులు వచ్చి చూసి తిరిగి వెళ్ళిపోయారే. పైసకి ఆశపడకుండా పిల్లకావాలని ఇంటికి కోడలుగా తెచ్చుకున్న నన్ను యిలా తేలిగ్గా చూస్తుందా ! ఆయన రక్తం

పుడికి పోతూ వుంటుంది. అయినా తనని తను సంబాళించుకొని రోజులు వెళ్ళదీస్తున్నారు. కొడుక్కి తన మనసులోని బాధని కాస్తకూడా తెలియకుండా జాగ్రత్తపడుతూ వుంటారు.

శ్యామల భోజనం చేసి వంటిల్లు సర్దుకుని పడక వేసిందంటే మూడు గంటలకి గానీ లేవదు యెంత అర్జెంట్ పనివున్నా ఆమెను లేపకూడదు. ఆమె నిద్రపోయే సమయంలో కాకులు అరవకూడదు పిచ్చుకలు కిచకిచ మనకూడదు అన్నా యీ ఆమెకి ఒళ్ళు తెలియని కోపం వచ్చేస్తుంది. ఆ కోపంలో మామగార్ని నోటికి వచ్చినట్టుగా తిట్టేస్తుంది. ఆ తిట్లు భరించలేని శివాజీరావు గారు కోడలు పడుకున్నంత సేపూ ఆమెకి నిద్రాభంగం కలక్కుండా ఓ బారెడి కర్ర చేత బట్టుకొని గది కిటికీ దగ్గర యిటూ అటూ తిరుగుతూ కాపలా కాస్తుంటారు శ్యామల పడుకునేగది దగ్గరే జామ చెట్టువుండటం వల్ల ఏవో కొన్ని పక్షులు వచ్చి వాలుతూ వుంటాయి. వాటిని అదిలిస్తే పారిపోతాయి. అయితే ఆయనకి వచ్చిన చిక్కల్లా పిచ్చుకలతో, వాటి దుంపతెగా యెంత అదిలించినా అవి చెట్టు మీదనుంచి యెగిరి పోయినట్టే పోయి తిరిగి వచ్చి 'కిచకిచ' మని గోల ప్రారంభిస్తాయి. వాటిని అదిలించటంతో ఆయనకి క్షణంకూడా విశ్రాంతి వుండదు ఒకవైపు తనకీ నిద్రముంచుకు వస్తూంటుంది. హాయిగా పడుకుని ఓ కునుకు తీయాలని వుంటుంది. కానీ వీలు కాదు. తను నిద్ర పోవాలంటే కోడలు నిద్ర లేవాలి.

తను వుద్యోగం చేస్తున్నప్పుడు భవిష్యత్తులోకి తొంగి చూసుకున్నప్పుడు "డబ్బు" వుంచుకోవాలి. అదివుంటే చాలు మరే యిబ్బందులూ వుండవు. అనుకునే వాడు. 'ఆడబ్బు' ఎక్కువ నిలవలేకున్నా తనకి వచ్చే పింఛను డబ్బుచాలు. తనకి యిప్పుడు యెదురయ్యే సమస్యలు డబ్బుతో పరిష్కారం అయ్యేవి కావే. ఈ సమస్యలకి పరిష్కారం ఈ జీవితం సమాప్తం అయినప్పుడే. ఆయన నిర్లిప్తంగా అనుకుంటూ పిచ్చికలని అదిలించి కర్రని భుజంమీద పెట్టుకుని యిటూ అటూ పచార్లు చేయసాగారు.

'పోస్టు' అన్న కేక అమృతప్రాయంగా విన్పించింది. శివాజీరావు గారు గేటుదగ్గరికి ఒక్క అంగలో వెళ్ళారు.

'నాకేనా !' అన్నారు పోస్టుమేను అందిస్తూన్న కవరు ఆతురతగా అందుకుంటూ "మీక్కాదు తాత గారూ మీకోడలికి. ఔనుగానీ తాతగారూ.

"మీకు ప్రతి గురువారమూ యెక్కడినించండీ ఉత్తరం వస్తుందీ"

"ఓ ఫ్రెండ్ దగ్గర నుంచి"

"ఫ్రెండా! మీక్కూడా ఫ్రెండ్సా ! తాతగారూ ప్రతి గురువారం వచ్చే ఉత్తరం ఈరోజు రాలేదండీ" అంటూ వెళ్ళిపోయాడు.

శివాజీరావు గార్కి నీరసం ముంచుకొన్చింది.

యివాళ కోసం నాలుగురోజుల నించీ యెదురు చూస్తూ గడిపాడు. ఈ రోజు ఉత్తరం రాకుంటే మళ్ళీ గురువారం వరకూరాదు. వారం రోజులు యెదురు చూడాలి నిస్సారమైన ఈ జీవితంలో స్నేహితుడు రాసే ఈ ఉత్తరాలు ఒయాసిస్సులు. అవీ కరువైతే.... ఎలా ! ఆత్మీయతాభిమానాలు యెక్కడ వెతుక్కోవాలి. వెతుక్కున్నా ఈ కాలంలో యెక్కడ దొరుకుతాయి. మనిషి సాటి మనిషిలో ఆత్మీయతా భావంతో మాట్లాడేంత అవకాశమూ అవసరమూ టైమూ యెక్కడుంటోంది ఈ యాంత్రిక యుగంలో.

"మామయ్యా యెక్కడ చచ్చావ్!" శ్యామల కంఠం ఖంగుమంది. శివాజీరావు గారు వులిక్కిపడి చూశారు. తనంటే పిచ్చికలకీ తేలికే. ఒక్క క్షణం ఏమరుపాటుగా ఉండేసరికి ఓ పది పిచ్చికలు కిటికీ లోనించి లోపలికి దూరి అల్లరి చేస్తున్నాయి.

'హూష్' అంటూ కర్ర గాలిలోకి విసరసాగారు. పిచ్చికలు ఎగురుకుంటూ వచ్చేశాయి. 'పిచ్చి ముండలు చస్తాయేమో' అనుకుంటూ నోటితోనే

భయపెట్టసాగారు. తన చేతిలోని వుత్తరం హాలులో టీపాయ్ మీద పెట్టి తిరిగి డ్యూటీ చేయసాగారు.

ఆయనకి నిద్ర వస్తోంది. కళ్ళ మీదకి నిద్రముంచుకు వచ్చేస్తోంది. కానీ నిద్ర పోవటానికి వీల్లేదు. తల్లీ నిద్రాదేవీ నన్ను కరుణించు. నాదరి చేరకు. గంటమూడు అయిన తర్వాత రా. నాకభ్యంతరం లేదు. అయితే అప్పుడు నీవు తీరుబడి వుండదని నాకు తెల్సునమ్మా.

ఆయన ఆవలింతలు ఆపుకుంటూ కర్ర పెట్టి చెట్టుకొమ్మని విసురుగా కొట్టారు దానిమీద వాలి వున్న పిచ్చికముండలు హడలిపోయి పారిపోయి మళ్ళీ రాలేదు.

# 2

శివాజీరావు గారి దిన చర్యలో పెద్దగా మార్పుఉండదు. టైముకి లేవటం కాలకృత్యాలు తీర్చుకొనీ స్నానం పూర్తి చేసుకోవటం, కోడలు విసురుగా పెట్టి వెళ్ళిన కాఫీగ్లాసు అందుకోవటం తాగటం, వరండాలోకి వచ్చి కూర్చొని పేపరు తిరగేయటం, తెలుగులో వార్తలు వినటం కాస్సేపు అలా బైటకి వెళ్ళి తిరిగి వస్తూ దారిలో వున్న దేవాలయం దగ్గర దేవుడిని దర్శించటం తిరిగి ఇల్లుచేరటం.

అప్పుడే కొంపకిరాకపోతే కాస్సేపు అలాబైటకి తిరగకూడదూ అన్నట్లు ముఖం పెట్టిన కోడలి వైపు చూసీ చూడనట్లు చూడటం, కొడుకు బ్యాంకుకు వెళ్ళినా పన్నెండు గంటలకి గానీ కోడలు వడ్డించక పోవటం, ఆ భోజనం కానిచ్చి కోడలు పడుకుంటే ఆమెకి నిద్రాభంగం కలక్కుండా 'డ్యూటీ' చేయడం. యిదే యిదే దినచర్య.

ఇరుగు పొరుగూ యిళ్ళలో తన వయసు వాళ్ళు యెవరూ లేక పోవటం వల్ల మరీ విసిగెత్తి పోతూవుంది.

ఈ విసుగులో ఈ చికాకులో స్నేహితుడి వుత్తరాలు పరమానందాన్ని కల్గిస్తూంటాయి. ఆయన రాసిన పాతవుత్తరాలన్నీ దాచివుంచుకుని అప్పుడప్పుడూ చదువుకోవటం ఓ కాలక్షేపంగా తయారైంది. అసలు శంభుతో పరిచయమే గమ్మత్తుగా జరిగింది.

ఓసారి తను తిరుపతి వెళ్ళాడు. కాటేజీలో బ్యాగ్ పెట్టి స్నానం వగైరా ముగించుకొని గుడికి వెళ్ళి దేవుడి దర్శనం చేసుకొని వచ్చి రూము తాళం వేస్తూ వుండగా యెదురు కాటేజీలో నించి ఓ నడివయసు ఆయన వచ్చి పల్కరించాడు.

'ఏవూరు మీది' అంటూ వివరాలు అడిగాడు పరిచయం చేసుకుంటూ 'చెప్పాను.' తర్వాత అడిగాను మీరేవూరి నుంచి వచ్చారు ?

"స్వగ్రామం తెనాలి. కానీ వుద్యోగరీత్యా ఏలూరు దగ్గర పల్లెటూరిలో వుంటున్నాను నాకో భార్య యిద్దరు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు వున్నారు. జీవితంలో ఎదురయ్యే పరిస్థితులకి విసిగి వేసారినప్పుడల్లా యిలా యీదేవుడి దగ్గరకి వస్తాను. కాటేజీ తీసుకుని రెండు రోజులుంటాను మానసికంగా కొంత స్థిమితపడిన తర్వాత తిరిగి వెళ్ళిపోతాను." అడక్కుండానే అన్ని వివరాలు చెప్పిన ఆయన స్వభావం నాకెంతో నచ్చింది. నా వివరాలూ చెప్పి తర్వాత అన్నాను.

"దేవుడి దర్శనం చేసుకుని వచ్చారా"

"లేదు. నేనెప్పుడూ దేవాలయంలో వున్న ఆ దేవుడిని చూడాలని అనుకోను. ఆయన్ని దర్శించుకోవాలని యెంతెంతో దూరంనించి వచ్చిన అమాయకులనీ, పిచ్చివాళ్ళనీ చూస్తూ ఆనందిస్తుంటాను." ఇందుకే నేను ఇక్కడికి వస్తుంటాను."

నా మనసు చివుక్కుమంది. అయినా బాధని అణుచుకుని అడిగాను. "అలా అనటంలో మీ వుద్దేశ్యం యేమిటి ?"

"చెప్పమంటారా"

"చెప్పండి" కుతూహలం అణుచుకుంటూ అడిగాను.

"నా పేరు శంభూ ప్రసాద్ యికపోతే అంటూ క్షణం ఆగి తిరిగి చెప్పసాగాడు. నా వుద్దేశ్యంలో మంచి మనసువున్న మనిషి దేవుడి కంటే గొప్పవాడూ అని. ఔనంటారా కాదంటారా"

'ఔను'

'మానవత్వం సాటి మనిషి అంటే సానుభూతీ అభిమానం ప్రేమా తెలిపే యిన్ని అవకాశాలుండగా యివన్ని మరిచి మానవత్వాన్ని సమాధి చేసి అహంకారం క్రౌర్యంతో జీవిస్తూ మనసులేని, మాటాడలేని ఈ విగ్రహాలని పూజించాలని, తమ గొంతెమ్మ కోరికలని తీర్చమనీ సడమంత్రపు సిరి కలగజేయమనీ వెర్రి మొర్రి కోరికలు కోరుతూ యిక్కడికి వచ్చే యీ ప్రజలు అమాయకులూ పిచ్చివాళ్ళూ కాక మరెవరంటారు. వాళ్ళని చూసి జాలిపడక యేం చేయమంటారూ"

శంభూప్రసాద్ చెపూన్న మాటలు ముందు విసుగ్గా తర్వాత కుతూహలంగా వింటూవుండి పోయాను. తిరిగి ఆయన చెప్పసాగాడు.

"మనిషి తనలో వున్న 'మంచి మనసు' అనే దేవుడిని చంపేసి తమ మనసులోని వికృత భావాలని ఏకరువు పెట్టి మాయాజాలం చేసి దేవుడు తమని యే అంతస్తులకో తీసుకవెళ్ళాలని పూజలు చేస్తారు. లంచాలిస్తారు. ఇందువల్లనే మన దేవాలయాలు ప్రశాంతతని కోల్పోయి వడ్డీ వ్యాపారస్తుల షాపుల్లా మారిపోయాయి. మీరేమంటారు." ఈ మాటలని మళ్ళీ మళ్ళీ మననం చేసుకొందే జవాబు చెప్పలేకపోయాను. అయన నవ్వి లేచి వెళ్ళిపోతూ తన చేతిలోని ఆంధ్రప్రభ దినపత్రిక నాకిస్తూ నాచేతిలోని 'ఉదయం' పత్రిక పట్టుకు వెళ్ళిపోయాడు.

విచిత్రమైన వ్యక్తిలా అనిపించాడు. అయినా ఆయన మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. ఆలోచిస్తూనే వున్నాయి.

ఆయన సాయంకాలం కన్పిస్తాడేమో అని చూశాను. కన్పించలేదు మరునటి రోజు రూము ఖాళీ చేసి తిరిగి వెళ్ళిపోయే ప్రయత్నంలో పేపరు యిచ్చేద్దామని యెదుటి కాటేజీ తలాపు తట్టాను. జవాబు రాలేదు. ఖాళీ చేసి వెళ్ళిపోయాడా! తాళం వేసిలేదు. మరెవరన్నా కొత్తవాళ్ళు వచ్చారా అన్న అనుమానంతో తలుపు మళ్ళీ తట్టాను. తలుపులోపల ఘడియ వేసి లేదులా వుంది. తెరుచుకుంది. ఆయన జాడలేదు కానీసన్నగా మూలుగు విన్పిస్తోంది. 'ఏమిటీ మూలుగు' అనుకుని రెండడుగులు లోపలికి వేశాను. బాత్ రూము దగ్గర నేలమీద పడిపోయివున్నాడు. శంభూప్రసాద్ వాంతులు చేసుకున్నట్టుగా చుట్టూ అసహ్యంగా వుంది. వాటి మీద ఈగలు ముసురుతున్నాయి. చప్పున దగ్గరగా వెళ్ళి పిలిచాను. చెయ్యి పట్టుకొని కదిలించాను అతను మెల్లిగా కళ్ళు తెరిచాడు. నిస్సహాయంగా చూస్తూ 'దోస్త్.... నా పరిస్థితి బాలేదు. రాత్రి నుంచి వాంతులు. యెవరినీ పిలిచే శక్తి కూడా లేక యిలా " అతని నోటి వెంట సరిగా మాటరావటం లేదు. నిన్న అతని రూపానికీ యివాళ రూపానికీ తేడా చూస్తుంటే నాకు జాలి ముంచుకు వచ్చింది. యెవరూ పరిచితులు లేని ఈ కొత్త ప్రదేశంలో పాపం ఆరోగ్యం దెబ్బతిన్నది. నా మనసు జాలితో నిండి పోయింది, అంతేనీళ్ళు తీసుకుని అవన్ని శుభ్రంగా కడిగి బట్టలు మార్చి మంచంమీద చేర్చి డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్ళి ఆ రోజు ప్రయాణం ఆపుకుని అతన్ని కని పెట్టుకుని వుండి పోయాను. మరునటి రోజుకి అతని స్థితి మెరుగైంది. హోటల్ భోజనం సరిగాలేక అలా అయిందనీ మరేంఫర్లేదనీ డాక్టర్ చెప్పాడు. అప్పుడు నేను బయలుదేరి వెళ్ళిపోతూ అన్నాను.

"యింత దూరం వచ్చారు కదూ. యెంతో ప్రమాదం తప్పి బయటపడ్డారు కదూ. దేవుడిని దర్శించుకుని మీవూరికి వెళ్ళండి" అన్నాను.

ఆయన తల అడ్డంగా వూపాడు.

"నాకు భగవంతుడు మీలో కన్పిస్తున్నాడు. దోస్త్ మీరు చేసిన సహాయానికి కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలియటం లేదు. కానీ నా జీవితం

ఉన్నంతవరకూ మిమ్మల్ని మర్చిపోలేను. నా అడ్రెస్ యిదిగో ఒకసారి మా వూరికి రండి. అంటూ నా అడ్రెస్ తను తీసుకుని చేతులెత్తి నమస్కరించాడు.

ఈ చిన్న సహాయానికి యింత కృతజ్ఞతా! అందరూ యిలా యెందుకు ఆలోచించరు. ఆలోచిస్తే ఈనాటి మనుషుల పోకడ యిలా వుంటుందా! ఆలోచిస్తూనే తిరిగి ఇల్లు చేరాను. వారం తర్వాత అతని దగ్గర నుంచి వుత్తరం వచ్చింది. జవాబు రాశాను. మళ్ళీ వుత్తరం రాయలేదు శంభూప్రసాద్. నేనూ అతని వుత్తరాల రాకకోసం యెదురు చూడలేదు. కానీ ఓ రోజు అతని దగ్గరనుంచి వుత్తరం వచ్చింది చాలా సంవత్సరాల తర్వాత.

దోస్త్ మీ వూరు యేదో పనివుండి వచ్చాను. మిమ్మల్ని చూడాలనిపించింది. వెతుక్కుంటూ వచ్చాను. కానీ మీరు వూరిలో లేరు. చాలా నిరాశ కల్గింది. వెళ్ళిపోయాను. నామనసెందుకో మీవైపుకి లాగుతోంది పోనీ వుత్తరాలు రాయకూడదూ.

ఇట్లు
శంభూప్రసాద్

ఇలా తిరిగి మామైత్రి పెరగసాగింది. వారానికి ఒకసారి నా వుత్తరం అతనికీ అతని వుత్తరం నాకూ చేరి తీరాల్సిందే. మొదట యిది ఓ అలవాటుగా తర్వాత తర్వాత మానలేనంత మానసిక బలహీనంగా తయారైంది. నా మనసులో ఓ కోరిక వుంది. అతని ఇల్లు యెలా వుంటుంది. ఇల్లాలూ యెలా వుంటారు.' వారితో యితను యెలా వుంటాడు. ఒక్కసారంటే ఒక్కసారి వెళ్ళి చూడాలన్న కోరిక పెరిగి పెరిగి మహా వృక్షం కాజొచ్చింది.

వెళ్లాలనీ వెళ్ళకూడదనీ గుంజాటన. అతను భార్య వున్న అదృష్టవంతుడు. సుఖశాంతులలో జీవిస్తూ వుండి వుంటాడు. ఒక్కసారి అతని

ఇంటినీ ఇల్లాలినీ చూసి తీరాలి. గట్టిగా నిర్ణయించుకున్నారు శివాజీరావు గారు.

శంభూప్రసాద్ దగ్గర నుంచి వుత్తరం రాకపోవడం వల్ల ఆతని ఆలోచనలతోనె శివాజీరావు గారికి టైము గడిచిపోయింది. కోడలు నిద్ర లేచింది. 'అమ్మయ్య' అనుకుని కర్ర కిందపడేసి వచ్చి వరండాలో కుర్చీలో వాలిపోయారు. పది నిముషాలు కాకుండానే 'మామయ్యా టీ తీసికోండి' అన్న శ్యామల పిలుపుకి కళ్ళు తెరిచారు.

ఈ పిల్ల మనస్తత్వం మేమిటోగానీ కాసేపున్న మర్యాద కాస్సేపు వుండదు అనుకుంటూ టీ తాగసాగారు.

# 3

శివాజీరావు గారు స్నేహితుడిని చూడాలని బయలు దేరారు. యెక్కువ ప్రయాసలేకుండానే వూరు చేరుకుని స్నేహితుడు యిచ్చిన అడ్రెస్ ప్రకారం ఇల్లు వెతుక్కున్నారు. అది ఓ చిన్న పెంకుటిల్లు చుట్టూ పడిపోయిన ప్రహరీగోడ. ఇంటి ముందు పచ్చగడ్డి పెరిగి వుంది. వాకిట్లో ఇద్దరు పిల్లలు గోలీలు ఆడుకుంటూ అడిగారు.

'శంభూప్రసాద్ గారి ఇల్లు యిదేనా'

'ఆ....ఇదే....లోపలికి వెళ్ళండి' తలెత్తి చూడకుండానే జవాబిచ్చారు వాళ్ళు.

శివాజీరావు గారి మనసు గమ్మత్తుగా స్పందింప సాగింది. తన కోరిక తీరబోతూవుంది. ఒక్కో అడుగు వేస్తూ వసారా దగ్గరకు వచ్చారు.

ఇంతలో ఇంట్లోనించి బిగ్గరగా కేకలు విన్పించి టక్కున ఆగిపోయారు. "యేమండోయ్ యెక్కడ చచ్చారూ! దీపాలు పెట్టాను. యిలా తగలడండి....దణ్ణం పెడతాను."

జవాబు రాలేదు.

"ఆ కుక్కపిల్లల మీదా పిల్లి పిల్లల మీదా వున్న ప్రేమలో వీసం వంతు కూడా నా మీద లేని మిమ్మల్ని యేం చేసినా పాపం లేదు. ఓ మొగుడు ముండా కొడుకా ఓసారి యిలా తగలడమని చెప్పానా!" ఆవిడ కంచు కంఠానికి చెవులు దిబ్బెళ్ళు పడసాగాయి.

ఆవిడ యెవరై వుంటుంది! ఎవర్ని వుద్దేశించిన మాటలవి శివాజీ రావు గార్కి అర్థం కాలేదు అసలు ఆడదాని నోటి వెంట యింత కర్కశమైన మాటలు వినటం తన జీవితంలో యిదే మొదలు. యింతకీ ఆ దురదృష్టవంతుడెవరో!

"ఏమండీ....ఒస్తారా లేక కర్ర పుచ్చుకురానా"

"నీ భక్తి తగలెయ్యా నన్ను నరకం పెట్టకే నీకు దణ్ణం పెడతానే. యిందాక నువ్వు పెట్టిన చెగోడిలు తిన్నవి అరగనే లేదు. అప్పుడే నీదండకం మొదలెట్టావా" దీనంగా వినిపించింది.

ఆ గొంతుని కుతూహలంగా విన్న శివాజీరావుగారి తల గిర్రున తిరిగిపోయింది. ఆ గొంతు ...శంభూప్రసాద్‌ది.

దేవుడంటే నీకు భక్తిలేదు. కనకనే మనల్ని ఆ దేవుడిలా వేపుకు తింటూన్నాడు. స్నేహితుడి అప్పుకి అడ్డం వుండి వాడు కాస్తా ఆ అప్పు యెగ్గొట్టి పారిపోతే మనింట్లో సొమ్ముని పట్టుకుపోయాడా మార్వాడీ. అయినా నీకు బుద్ధి రాలేదు మనుషులే కావాలి. వాళ్ళే దేవుళ్ళంటావు. పిల్లలు రెక్కలొచ్చి యెగిరిపోయినా నువ్వు శనిగ్రహంలా నాకు మిగిలావు. అయినా నేను నీకు దణ్ణం పెడుతూనే వున్నాను. యెందుకో తెల్సునా. యిది పతివ్రతా లక్షణమనీ యిలా చేస్తే లక్ష్మి దేవి నా నట్టింట తిష్ట వేస్తుందనీ మా అమ్మ నాకు చెప్పింది. ఇందుకే నీకు అన్నం విస్తట్లో పెడుతున్నాను".

శివాజీరావు గారింక వినలేక పోయారు. అంతే గబుక్కున వెనక్కి తిరిగాడు. చకచకా నాలుగడుగులు వేశారు. ప్రేమ పూర్వకమైన పిలుపు

విన్పించింది. "దోస్త్ ఎప్పుడొచ్చావ్! అప్పుడే వెళ్ళిపోతున్నావా. వెళ్ళద్దు దోస్త్‌రా వెనక్కి''. శంభూప్రసాద్ ముఖంలో కళలేదు. తెల్లగా పాలిపోయినట్లుంది. ఆయన దగ్గరగా వచ్చాడు. స్నేహితుడి ముఖంలోకి చూస్తూనే అనుకున్నారు శివాజీరావుగారు. తనిలా కబురూ గానీ లేకుండా రావటం అన్నది యెంత పొరబాటు పనో అని శంభూప్రసాద్ చెయ్యి పట్టుకుని సున్నితంగా నొక్కి వదిలేస్తుంటే శంభూప్రసాద్ ముఖంలో చెప్పలేనంత సంతోషం కన్పించి ఆశ్చర్యం కల్గింది శివాజీరావు గార్కి.

'నేను....వుత్తరం రాయలేక పోయాను....క్షమించు' శంభూప్రసాద్ గొంతు గాద్గదీకమైంది.

పర్లేదు. నీ వుత్తరం కోసం యెన్నేళ్ళైనా యెదురు చూస్తాను. మనం ఆ వుత్తరం ప్రపంచంలోనే బ్రతుకుదాం. కానీ "దోస్త్ రానిక నీకోసం" అంటూ మిత్రుడిని ఒక్కసారి గట్టిగా కౌగిలించుకుని వదిలేసి చకచకా నడిచి ఇల్లు దాటిన శివాజీరావు గార్ని వారించ లేక అలాగే నిలబడిపోయాడు శంభూప్రసాద్. ఆయన కళ్ళలో రెండు కన్నీటి చుక్కలు మాసిన గుబురు గడ్డంలోకి జారిపోయాయి

ఇంటి ముఖం పట్టిన శివాజీరావు గార్కి కోడలు పిచ్చిపిల్లలా ఆమెకి నిద్రా భంగం కలక్కుండా పిచ్చికలని కొట్టడం ఓ ఆటలా సరదాగా అన్పించ సాగింది. తిరిగి ఆయన మనసు స్నేహితుడి దగ్గరకి పరుగు తీసింది.

దోస్త్ నీ మనసుని నీ భార్య యేం అర్థం చేసుకోగలదు. ఆవిడ సగటు మనిషి. మానవత్వపు విలువల విషయంలో నీ యెత్తుకు యెదగటం ఆమెవల్ల కాదు. నేనే నిన్ను చాలా ఆలశ్యంగా అర్థం చేసుకున్నానుకదూ.

ఆయన మనసు నిండా శంభూప్రసాదే.